

# నవభూమి వరంగల్

అనుబంధం

24 అక్టోబర్,2024 గురువారం పేజీలు:4

www.epaper.navabhoomi.in



## చిన్న దేవాలయాల అభివృద్ధిపై

# చిన్నచూపు!



**మహబూబాబాద్, –నవభూమి:** మహబూబాబాద్‌లోని శ్రీరామ మందిరం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పెద్ద ఆలయాల ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై పోటీ తీవ్రంగా ఉంటుంది. జిల్లాలో దేవాలయ ట్రస్ట్ బోర్డు నియామకానికి 8 ఆలయాలు అర్హత కలిగి ఉన్నాయి. ఆయా ఆలయాల ఆదాయ, వనరుల మేరకు వాటిని వివిధ కేటగిరీలుగా విభజించారు. ముఖ్యంగా కురవి శ్రీ వీరభద్రస్వామి ఆలయం, గుంజేడు ముసలమ్మ, నర్సింహులపేట స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గాలకు తీవ్రమైన పోటీ ఉంటుంది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న చిన్న దేవాలయాల ట్రస్ట్‌బోర్డు నియామకాలపై స్థానిక ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారు. దీంతో వివిధ విభాగాల్లో గుర్తింపు కలిగిన ఈ చిన్న ఆలయాల నిర్వహణ, ఆలనాపాలన చూసే నాథులు కరవయ్యారు. ఆ దేవాలయాల అభివృద్ధి, భక్తులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీప, ధూప నైవేద్యాలకు కూడా ప్రభుత్వ గుర్తింపు పొందినా జిల్లాలో ఇప్పటివరకు పాలకవర్గాల నియామకం జరగని కొన్ని ఆలయాలున్నాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా పాలకవర్గాల నియామకంపై ఊసెత్తడం లేదు. జిల్లా కేంద్రంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయం, రామాలయానికి పాలకవర్గం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈమేరకు ప్రకటన జారీ చేసినా అవి ప్రచారంలోకి రాకపోవడంతో ఎవరూ దృష్టి సారించడం లేదు. పాలకవర్గాల్లో సభ్యులు ఇలా..ప్రతి ఆలయ పాలక మండలిలో నిబంధనల మేరకు మహిళ, ఎస్సీ, ఎస్టీలకు సభ్యుడికి విధిగా అవకాశం కల్పించాలి. ఆలయ అర్చకులు, అధికారులు ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా ఉంటారు. 6ఏ విభాగం పాలకమండలిలో 14 మంది సభ్యులను నియమించాల్సి ఉంటుంది. 6బి విభాగంలో ఏడుగురు, 6సి కేటగిరీలో ఐదుగురు సభ్యులుంటారు. పాలకమండలి ఏర్పాటు చేస్తే ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం, దాతల నుంచి నిధులను సమీకరించే అవకాశం ఉంటుంది. సంబంధిత ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణలకు పాలకవర్గం పర్యవేక్షణ చేస్తుంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం అయినా చిన్న ఆలయాల పాలకవర్గాల నియామకాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ చట్టంలో సూచించిన నిబంధనల మేరకు ఆయా దేవాలయ ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రకటనలు జారీ చేసి నిర్దేశించిన గడువులోగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

# ఆ రహదారిలో..నెలకో ప్రమాదం



2

## నకిలీపోడు పట్టాల

# తయారీ ముఠా అరెస్టు




**ములుగు –నవభూమి:** నకిలీ పోడు పట్టా పాసుపుస్తకాలు తయారు చేసిన ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఐఏఎస్, ఐఏఎఫ్ఎస్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి పోడు పట్టా పాసుపుస్తకాలు తయారుచేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఎఫ్ఆర్వో డోలి శంకర్ తెలిపిన వివరాలు ఇలా.. ఈ నకిలీ పోడు పాసుపుస్తకాల వ్యవహారంలో ఏడుగురు వ్యక్తులు సూత్రధారులుగా ఉన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముగ్దుంపురం గ్రామానికి చెందిన చాందావత్ భద్రు ములుగు మండలంలోని పలు మండలాల రైతుల నుంచి డబ్బులు తీసుకుని ఈ తతంగాన్ని నడిపించాడు. వరంగల్ నగరానికి చెందిన గణేష్ ప్రింటర్స్ యజమాని తాటిపాముల రాజు ఒక్కో పాసు పుస్తకానికి రూ.2 వేలు తీసుకుని నకిలీ పుస్తకాలు తయారు చేసేవాడు. ఆన్‌లైన్ సెంటర్ నడుపుతున్న నర్సంపేటకు చెందిన భూక్య వెంకన్న క్యూఆర్‌కోడ్ సృష్టించాడు. మహబూబాబాద్‌కు చెందిన బానోత్ హరినాయక్ హెూలోగ్రామ్ తయారు చేశాడు. నర్సంపేటకు చెందిన ధారావత్ కిషన్ బ్యాంకు రుణాల కోసం అటవీశాఖ రేంజ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి క్లియరెన్స్ ధ్రువీకరణ పత్రాన్ని రూపొందించాడు. వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామానికి చెందిన జాటోత్ రాజ్‌కుమార్ (ఎఫ్ఆర్సీ ఛైర్‌పర్సన్) అటవీ హక్కు పత్రం పాసు పుస్తకం నమూనా పంపించాడు. ములుగు మండలం కాసిందేవ్‌పేట గ్రామానికి చెందిన వాంకుడోత్ రవి ఏజెంటుగా వ్యవహరిస్తూ.. పాసుపుస్తకం కావాలన్న వారి దగ్గర డబ్బులు వసూలు చేసి వివరాలను భద్రుకి పంపించేవాడు. ఏడుగురు వ్యక్తులు ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారని, బ్యాంకులో రుణం పొందడానికి నకిలీ పోడు పట్టాల పుస్తకాలు తయారు చేసినట్లు విచారణలో తేలిందని ఎఫ్ఆర్వో తెలిపారు. మిగతా వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కేసు నమోదు చేస్తామన్నారు.

# చర్యలుంటాయా..'మామూలే'నా



3


## డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు




**దామెర, –నవభూమి:** డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ జిల్లా పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు.దామెర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి, 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేశాడు.దీంతో అతనిపై ఖమ్మం జిల్లా పరిధిలో సుమారుగా 10కి పైగా కేసులు నమోదయ్యాయి. రూ.800తో మరో నకిలీ తుపాకీ కొనుగోలు చేశాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈ నెల 21న ఖమ్మం నుంచి రైలులో వరంగల్‌కు చేరుకుని అర్ధరాత్రి వేళ ఊరుగొండ వద్ద ఆటో దిగాడు. అక్కడ కిరాణం దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్రలేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు.లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లా పెట్టెలో రూ.2000 తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈక్రమంలో సంపత్ దుండగుడు వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. వెంటనే చేరుకున్న స్థానికులు అతణ్ని బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దుండగుడు వెంకటేశ్వర్లు వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరి వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, ఉన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాకం.. వైద్యం వికటించి బాలిక మృతి

**హనుమకొండ: –నవభూమి:** పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్లక్ష్యం రోగుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులు మాత్రం అలసత్వాన్ని వదలడం లేదు. దీంతో పలువురు రోగులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో పేషంట్లు చనిపోయిన సంఘటనలను కూడా చూస్తునే ఉన్నాం. వైద్య శాఖ అధికారులు అడప దడప ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్నారు. అధికారుల ఉదాసీనత వైఖరితో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు ఇష్టారీతిగా వ్యవహారిస్తున్నారు.హనుమకొండలో తాజాగా మరో సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డాల్ఫిన్ చిల్డ్రన్స్ హాస్పిటల్లో వైద్యం వికటించి బాలిక మృతిచెందిింది. ఈనెల 2వ తేదీన జ్వరంతో డాల్ఫిన్ హాస్పిటల్లో ములుగు జిల్లాకు చెందిన వర్షిత చేరింది. వైద్యుల నిర్లక్ష్యంతో బాలిక మృతి చెందిందంటూ ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు బైఠాయించి ఆందోళనకు దిగారు. రాత్రి డాల్ఫిన్ ఆస్పత్రి అద్దాలను మృతురాలి బంధువులు ధ్వంసం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.డాల్ఫిన్ ఆస్పత్రిలో నెల రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన. ఈ ఆస్పత్రిపై ప్రజలు పలు ఆరోపణలు చేస్తున్నారు.



## ఆధునిక శిక్షణ..

# అందని ద్రాక్షేనా?

**కాటారం(–నవభూమి:** నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు.. ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)ను ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది.రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించగా జిల్లాలోని మంథని నియోజకవర్గ పరిధిలోని కాటారం మండలంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)కు అనుసంధానంగా ఏటీసీ మంజూరైంది. నిర్మాణానికి సుమారు రూ.4కోట్లకు పైగా మంజూరైనా నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. త్వరితగతిన నిర్మాణం చేపడితే నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.స్థల సమస్యతో జాప్యం..గతంలో ఐటీఐ, ఏటీసీ నిర్మాణానికి గంగారం మోడల్ కళాశాల సమీపంలో ఏడెకరాల స్థలాన్ని కేటాయించారు. కొంత ఆక్రమణకు గురై వివాదంతో ఏటీసీ నిర్మాణం ముందుకు సాగలేదు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ త్వరితగతిన ఏటీసీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులు మండలకేంద్రంలో మినీ స్టేడియంకు ప్రతిపాదించిన తిమ్మనకుంట భూమిని పరిశీలించి ఎకరం కేటాయించారు. ఆ స్థలంలోనూ తమ ఇళ్ల స్థలాలు ఉన్నాయంటూ కొందరు అడ్డుకుంటుండడంతో ఏటీసీ నిర్మాణానికి ఆలస్యం జరిగింది. దీంతో మళ్లీ గంగారంలో కేటాయించిన స్థలంలోనే ఐటీఐ, ఏటీసీ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు.కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ




సంస్థ(ఐటీఐ)ప్రవేశాలు ఆలస్యం..ఇప్పటికే చాలా వరకు ఏటీసీల్లో అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభమై దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత మండలంలోనే ఏటీసీ నిర్మాణంలో జాప్యంతో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం లేదు. అడ్మిషన్లు ప్రారంభమైన ఇతర ఏటీసీల్లో చేరాలంటూ ప్రోత్సహిస్తున్నారు. నిరుద్యోగ యువతకు దూర ప్రయాసలు, ఆర్థికభారం పడనుంది. దీంతో అటవీ ప్రాంత నిరుద్యోగ యువత అధునిక శిక్షణకు దూరమయ్యే అవకాశం ఉంది. త్వరితగతిన ఏటీసీ నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత యువతకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.ఆరు కొత్త కోర్సుల్లో శిక్షణ యువతలో నైపుణ్యాలు అభివృద్ధిచేసి.. ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చేందుకు టాటా టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఏటీసీలలో ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే కోర్సులు.. మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, రెండు సంవత్సరాల కోర్సులు బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషనింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ అనే ట్రేడుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక ఏడాది కాలపరిమితి గల ట్రేడ్‌లలో 40 చొప్పున సీట్లు, రెండేళ్ల కాలపరిమితి గల ట్రేడ్‌లలో 24 సీట్ల చొప్పున అవకాశం కల్పించనున్నారు. ఇప్పటికే ఆధునిక కోర్సులపై ఐటీఐ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.త్వరలో అందుబాటులోకి కోర్సులు–భిక్షపతి, ప్రిన్సిపల్, ఐటీఐ, కాటారం ఏటీసీ నిర్మాణంలో జాప్యంతో నూతన కోర్సుల్లో అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభించలేదు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రక్రియ చేపడతాం. ఏటీసీతో ఆరు నూతన కోర్సుల్లో శిక్షణతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

# ఆ రహదారిలో..నెలకో ప్రమాదం

**మహబూబాబాద్ –నవభూమి:** జమాండ్లపలి–కంబాలపల్లి మధ్య జాతీయ రహదారి జిల్లాలో ఓ ప్రధాన జాతీయ రహదారి.. అందులోనూ ఓ ముఖ్య మార్గంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.ఇప్పటి వరకు జరిగిన ప్రమాద సంఘటనల్లో అతివేగం, నిర్లక్ష్యం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కిలోమీటరు దూరంలో పది నెలల కాలంలో జరిగిన ప్రమాదాల్లో పది మంది మరణించారు. తాజాగా జరిగిన ఘటనలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు దుర్మరణం చెందడం అందర్ని కలువరపరుస్తోంది. ప్రమాదాల్లో మృతి చెందిన వారు ఎక్కువ గూడూరు మండలానికి చెందిన వారే ఉన్నారు.మహబూబాబాద్–నర్సంపేట నెంబర్ 365 జాతీయ రహదారిలో జమాండ్లపల్లి–కంబాలపల్లి మధ్య మార్గంలోని కిలోమీటరు దూరంలోని రహదారిపై వాహన ప్రమాదాలు తురుచుగా జరుగుతున్నాయి. ప్రధానంగా రెండు, మూడు ప్రదేశాల్లోనే జరగడం గమనించాల్సిన విషయం. జమాండ్లపల్లి మూలమలుపు నుంచి కంబాలపల్లి గ్రామ శివారు వరకు కిలోమీటరు రహదారిలో ద్విచక్రవాహనాల నుంచి మొదలు కార్లు విపరీతమైన వేగంతో నడిపిస్తున్నారు. దీనికితోడు కొందరు మద్యం మత్తులో ఉండి వాహనాలు నడిపిస్తున్నట్లు, ఈ మార్గంలో జరిగిన ప్రమాదాల్లో మత్తులో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలే అధికమని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం ఈ మార్గంలోనే అర్బన్ పార్కు వద్ద ద్విచక్రవాహనాన్ని అతి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్కడికక్కడే మరణించారు. మహబూబాబాద్ వైపు నుంచి వస్తున్న కారు రహదారి నిబంధనలు పాటించకుండా వేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం వాటిల్లిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో కారుతో పాటు ద్విచక్రవాహనం కూడా ఆనవాళ్లు పట్టనంతగా మారింది.ద్విచక్రవాహనం ఢీకొట్టి పొదల్లోకి దూసుకెళ్లిన కారు గత సంఘటనలు డిసెంబర్ 31న మహబూబాబాద్ శివారు ఏటిగడ్డతండా సమీపంలో వేంగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతి చెందారు జనవరి 2న ఇదే మార్గంలోని ముత్యాలమ్మగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో బాలుడిని కారు ఢీకొని మృతి చెందాడు జనవరి 15 రాత్రి సమయంలో కారు అతివేగంగా ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గూడూరు మండలం చిన్న ఎల్లాపుర్ శివారులోని ఆముతండాలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. వీరిల్లో ఇద్దరు చిన్న పిల్లలున్నారు.ఇవి పాటిస్తే మేలు ప్రమాద సూచిక బోర్డులను నెలకొల్పాలి.ప్రమాదాల జోన్‌గా పరిగణిస్తూ రేఖ నియంత్రికలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.ఈ మార్గంలో పోలీసులు తరుచుగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలి.



## తల్లిలాంటి ఒడి!



**ములుగు, –నవభూమి:** కడు పేదరిక జీవితాలు అవి. చెమట చిందిస్తేనే పూట గడుస్తుంది. కూలికి పోతేనే కూడు.. లేదంటే పస్తులే. పొద్దు పొడవక ముందే మొదలై సాయంసంధ్య వరకూ రెక్కలు ముక్కలు చేసుకోవాల్సిందే. పల్లెల్లో జీవన చిత్రంలో నిత్యం కనిపించే దృశ్యాలివి. చంటి బిడ్డలను చంక దింపదింపలేక.. గుడిసెలో ఒంటరిగా వదిలి వెళ్లలేక అనేకమంది పేద తల్లులు ఇబ్బందులు పడుతున్నా రు. పొలం గట్టుపైనో, చెట్టుకు చీరతో ఊయల కట్టో వారిని నిద్రపుచ్చి పనులు చేసుకునేవారు ఎంతమం దో! వృద్ధులైన తల్లిదండ్రులుంటే బాలల ఆలనా పాల నా వారు చేసుకుంటారు. అదే పెద్దదిక్కు లేకుంటే ఆ పేద తల్లిదండ్రులకు గోసే. ఇలాంటి పరిస్థితి నుంచి ఊరట కలిగించేందుకు ప్రభుత్వం శిశు సదనాలను ఏ ర్పాటు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తం గా నిర్వహించే ఈ చైల్డ్‌కేర్ సెంటర్లకు క్రష్ ఫౌండేష న్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోంది. ఏడు నెలల వయసు నుంచి మూడేళ్లలో పు చిన్నారులకు ఇక్కడ అమ్మ ఒడిలాంటి ప్రేమనుపం చుతూ సంరక్షించేందుకు అడుగులు పడుతున్నాయి.ములుగు జిల్లాలో 30 కేంద్రాలు కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం వాటాతో ఈ శిశు సదనాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడున్న అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా వీటిని నెలకొల్ప నున్నారు. తెలంగాణ రాష్ట్రానికి వెయ్యి కేంద్రా లు మంజూరు కాగా ఆర్థికంగా, సామాజికంగా వెనుక బడిన ములుగు జిల్లాకు 30 కేటాయించారు. వ్యవసా య, దినసరి కూలీలు, మూడేళ్లలోపు చిన్నారులు ఎక్కువ మంది ఉన్న కేంద్రాలను గుర్తించి వాటికి ప్రాధాన్యమివ్వనున్నారు. ప్రయోగాత్మకంగా తొలి విడతలో ఆరు చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ములుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి లోని దేవనగర్, మల్లంపల్లి-3, ఏటూరునాగారం ప్రాజె క్టు పరిధిలోని రోహీర్-1, వెంకటాపురం(నూగూరు) పరిధిలోని రామచంద్రాపురం, ముత్తారం, ఏటూరు నాగారం ప్రాజెక్టు పరిధిలో మంగపేటలోని కూరాకుల వీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ శిశు సదనాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ అక్కే శ్వర్‌రావు బృందం శనివారం ములుగు మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ను సందర్శించి సానుకూల తను పరిశీలించింది. తొలుత ఈ ఆరు కేంద్రాలను ప్రారం భించనున్నారు. నిర్వహణలో లోటుపాట్లను సర్దుబా టు చేసుకొని నవంబరు 14 వరకు మిగతా 24 కేం ద్రాలను సిద్ధం చేయనున్నారు. కాగా, రెండు మొబైల్ శిశు సదనాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ దివాకర ప్రతిపాదించారు. ఉపాధిహామీ పనులు, కూలీ పను లు జరిగే ప్రదేశంలో వాహనాలను ఏర్పాటుచేసి చం టిపిల్లలను సంరక్షించనున్నారు. దీనికి అనుగుణంగా మోడల్ వాహనాలను రూపొందించేందుకు ఆలోచన చేస్తున్నారు.ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు..సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఉంటారు. ఉదయమే పనిలోకి వెళ్లి సాయంత్రానికి గానీ తిరిగి రారు. అందుకే ఈ శిశు సదనాలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా ఓ టీచర్, ఆయాలను నియమిస్తారు. పిల్లలను నిద్రపుచ్చడానికి ఉయ్యాలలు, ఆడుకోవడానికి బొమ్మలు, ఆట వస్తువులు, వాకర్లు, ఇతర ఏర్పాట్లు ఉంటాయి. గుడ్లు, బాలామృతం పాలు, పండ్లు ఇవ్వనున్నారు. ఆరోగ్యానికి సంబంధించి హెల్త్ కిట్లను కూడా సమకూర్చుతున్నారు. ఒక్కో చిన్నారికి రోజుకు రూ.8 చొప్పున ఖర్చుచేయనున్నారు.జిల్లాలో 9,824 మంది చిన్నారులు జిల్లావ్యాప్తంగా నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 640 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారు లు 9,824 మంది ఉన్నారు. అయితే 294 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా 149 అద్దె గదుల్లో కొనసా గుతున్నాయి. మరో 197 ప్రభుత్వ పాఠశాలల్లోని గదుల్లో నిర్వహిస్తున్నారు. శిశు సదనాలకు ప్రత్యేకం గా ఓ గది, మూత్రశాల, మరుగుదొడ్డి తదితర సౌక ర్యాలున్న నిర్మాణాలు అవసరమున్నాయి. వీటిని గుర్తించేందుకు ఐసీడీఎస్ అధికారులు గ్రామాల్లో పరిశీలన చేపట్టారు. తల్లిదండ్రులకు మంచి అవకాశం : కె.శిరీష, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో మూడేళ్లలోపు చిన్నారులున్న నిరుపేద తల్లిదండ్రుల కు శిశు సదనాలు ఎంతగానో ఉపయుక్తం కానున్నా యి. పాలు తాగే చంటిబిడ్డలను ఈ శిశు సదనాల్లో చేర్చుకొని సంరక్షించనున్నాం. వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని ఇస్తూనే తల్లి ప్రేమను పంచుతాం. ఈ శిశు సదనాలను గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు సద్వి నియోగం చేసుకోవాలి. ఈ కేంద్రాల నిర్వహణ కోసం కొత్తగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను నియమించు కుంటాం. దీంతో మరింత మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి లభిస్తుంది.

# చర్యలుంటాయా..‘మామూలే’నా

**మహబూబాబాద్ –నవభూమి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన శ్రీ లక్ష్మి పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 యాసంగి సీజన్‌లో పౌరసరఫరాల శాఖ 62579.80 క్వింటాళ్ల ధాన్యం కేటాయించింది.మిల్లరు సీఎంఆర్ కింద ధాన్యం మరాడించి 42553.58 క్వింటాళ్ల బియ్యం అందజేయాల్సి ఉండగా 24,336 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చి మిగతాది బకాయిపడ్డారు. అందుకు సంబంధించిన రూ.6.49 కోట్ల విలువైన 26,790 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు మాయమైనట్లు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం గత నెల 20న మిల్లులో చేపట్టిన దాడుల్లో గుర్తించింది. ఈ మిల్లు జిల్లాలో పేరున్న ఒక మాజీ ప్రజాప్రతినిధిది. గతేడాది వానాకాలం సీజన్‌లో ధాన్యం కేటాయింపు నిలిపివేయగా అధికారులపై ఒత్తిడి తెచ్చి ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారు.ఉమ్మడి వరంగల్‌లోని కొంత మంది రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లాడించి సకాలంలో బియ్యం అప్పగించకుండా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. వీరిలో మూడు, నాలుగు సీజన్లకు సంబంధించి బియ్యాన్ని ఇవ్వని వారున్నారు. వీరికి పలుమార్లు గడువు ఇచ్చినా ఫలితం లేకపోయింది. క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో బకాయిపడ్డ మిల్లర్లు కొందరు ధాన్యాన్ని అడ్డదారిలో అధిక ధరలకు విక్రయించి రూ.కోట్లు గడించారు. వీరిపై ఈసారైనా చర్యలు తీసుకుంటారా లేదా ఎప్పటిలాగే ‘మామూలు’గా వదిలేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచెర్ల శివారులోని నవ్య పారాబాయిల్డ్ రైస్



మిల్లుకు 2022-23 సీజన్‌లో పౌరసరఫరాలశాఖ 53,560 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించింది. మిల్లర్లు సీఎంఆర్ కింద 36,240 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా 8,871 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా 27,549 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాలి. మిగతా 40,513 క్వింటాళ్ల ధాన్యంలో కేవలం 6,238 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దాంతో మిల్లరు ప్రభుత్వానికి రూ.8.36 కోట్లు నష్టపరిచినట్లు గత నెల 21న మిల్లులో తనిఖీ చేసిన రాష్ట్ర పౌరసరఫరాల టాస్క్‌ఫోర్స్ బృందం పేర్కొంది.ఇలా జరగాలి..మిల్లులకు ధాన్యం కేటాయించిన తర్వాత అక్కడ లెక్క ప్రకారం నిల్వలున్నాయా.. లేవా, మిల్లాడిస్తున్నారా.. లేదా అనేది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా పౌరసరఫరాలశాఖ వద్ద సరిపడా సిబ్బంది లేదు. దాంతో పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా స్థాయిలో రెవెన్యూ అదనపు కలెక్టర్లు, మండల స్థాయిలో డిప్యూటి తహసీల్దార్లకు అప్పగించారు. వారు మిల్లులను పరిశీలించి బియ్యం నిల్వల నివేదికలను రాష్ట్ర అధికారులకు అందించాలి. తేడాలున్న మిల్లులకు మరో సీజన్‌కు సంబంధించి ధాన్యం కేటాయింపు నిలిపివేస్తారు.ఇదీ జరుగుతోంది..మిల్లర్ల అక్రమాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వకపోవడం వల్లనే ఒక సీజన్‌ది కాస్త నాలుగు సీజన్లకు పెరిగింది. ఇందుకు అధికారులు మిల్లర్ల నుంచి రూ.లక్షల్లో ఆమ్యామ్యాలను పుచ్చుకుంటూ ధాన్యం కేటాయింపులకు సహకరించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని మిల్లలకు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయించారు. అప్పుడు కూడా అధికారుల అండదండలతో పక్కదారి పట్టించారు.ఇదీ పరిస్థితి..ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 94 మంది రైస్ మిల్లర్లు బియ్యం అప్పగించలేదు. వీరిలో రెండు, అంతకంటే ఎక్కువ సీజన్లు బకాయి ఉన్న వారికి ప్రస్తుత సీజన్ నుంచి ధాన్యం కేటాయింపు నిలిపివేయాలనేది పౌరసరఫరాలశాఖ నిర్ణయించింది. మిల్లర్లు కొందరు ధాన్యం కేటాయింపుల కోసం గతంలో మాదిరిగానే అధికారులను మచ్చిక చేసుకోవడానికి మంతనాలు చేస్తున్నట్లు తెలిసింది.

# ఉత్పత్తి వ్యయం..సింగరేణిపై భారం

**భూపాలపల్లి –నవభూమి:** కేటీకే 5వ గని ఆవరణలో రవాణాకు సిద్ధంగా సింగరేణి బొగ్గు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వ్యయం రోజురోజుకు పెరుగుతోంది.. కోల్ ఇండియా సంస్థలైన మహానది కోల్‌ఫీల్డ్స్(ఒడిశా), వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్(మహారాష్ట్ర) కన్నా సింగరేణి సంస్థలో ఉత్పత్తిచేసే బొగ్గు ధర అధికంగా ఉంటోంది.రవాణా ఛార్జీల భారం కారణంగా రాష్ట్రంతో పాటు పలు దక్షిణాది విద్యుత్తు సంస్థలు సింగరేణిపైనే ఆధారపడుతున్నాయి. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్తులో సింగరేణి మనుగడపై ప్రభావం పడొచ్చనే అభిప్రాయం సంబంధిత అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. దీంతో పాటు గనుల్లోకి త్వరలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించనున్న తరుణంలో సింగరేణికి మరింత పోటీ ఎదురుకానుంది. వచ్చే ఐదారేళ్లలో ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోక తప్పదనే వాదన వినిపిస్తోంది.. ప్రస్తుతం ఈ అంశం అన్ని కోల్‌బెల్ట్ ఏరియాల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు బొగ్గు బ్లాకులను కట్టబెట్టే అంశం కార్మికుల అభద్రతాభావానికి కారణమవుతోంది. ఈ క్రమంలోనే అన్ని కోల్ బెల్ట్ ఏరియాల్లో కార్మికులు, అధికారులు నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని ఇటీవల సింగరేణి ఎండీ బలరాం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఓసీపీ గనుల్లో అధిక బొగ్గు ఉత్పత్తి కోసం భూసేకరణ పనులను అధికారులు వేగవంతం చేశారు.ప్రైవేటు సంస్థల కారణంగానే..ఇంత వరకు భూగర్భ, ఉపరితల గనుల్లో బొగ్గును నిర్ణీత మొత్తానికి వెలికితీసే పనులకు పరిమితమైన ప్రైవేటు కంపెనీలు.. ఇకపై ఏకంగా వేలంలో బొగ్గు బ్లాకులనే సొంతం చేసుకుంటున్నాయి. ఏడేళ్ల క్రితం భూపాలపల్లి డివిజన్‌లోని తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను కేంద్రం ఓ ప్రైవేటు సంస్థకు కేటాయించడంతో కార్మికుల్లో పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకుని ఆ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించింది. కానీ, సింగరేణి ప్రాంతాల్లోనూ బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రెండేళ్లుగా చేపట్టడంతో ప్రైవేటు సంస్థలు వాటిని పొందే అవకాశం ఏర్పడింది. ఈ మేరకు సింగరేణి ప్రాంతంలోనే బయట కంపెనీలు పోటాపోటీగా బొగ్గు ఉత్పత్తి చేసి సింగరేణి కన్నా తక్కువ ధరకే విక్రయించే అవకాశం ఉంది. దీంతో మార్కెట్‌లో కొనుగోలుదారుల సంఖ్య తగ్గే ప్రమాదం కూడా లేకపోలేదు.ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచడానికే..హబీబ్ హుస్సేన్, సింగరేణి జీఎం.భూపాలపల్లి ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడమే కాకుండా నిర్దేశిత లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి చేపట్టాల్సిన అవసరం ఉంది. కార్మికులు, ఉద్యోగులు 8 గంటల సమయంలో పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలి. ప్రైవేటు కంపెనీల కన్నా మరింత సమర్థతను కనబర్చి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి కార్మికులు, అధికారులు దృష్టి పెట్టాల్సిన బాధ్యత ఉంది. భూపాలపల్లి ఏరియాలో ఓసీ-2, ఓసీ-3 గనుల్లో బొగ్గు ఉత్పత్తి సాధించడానికి భూసేకరణ పనులు పూర్తి దశకు చేరాయి. ఈ ఏరియాలో సుమారుగా 738 ఎకరాల భూసేకరణ పూర్తయితే బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి సమస్య ఏర్పడదు. వచ్చే మూడు నెలల్లో ఓసీపీ గనులకు సంబంధించిన పనులు పూర్తి చేసి, సంబంధిత రైతులకు మెరుగైన నష్టపరిహారం చెల్లించనున్నారు.

